క్లుప్తంగా

ఎక్స్‌టర్నల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షకు అనుమతించాలి

సింగరేణి(కొత్తగూడెం): దూర విద్యావిధానంలో పీజీ(ఎంఏ సోషియాలజీ) చేసిన ఇంటర్నల్ ఉద్యోగులను ఎక్స్‌టర్నల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షకు అనుమతించాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) బి.హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దూరవిద్యా విధానంలో చదువుకున్న అభ్యర్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని పరీక్షలకు అనుమతిస్తున్న నేపథ్యాన సింగరేణి సంస్థలో కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ.రజాక్, సోమిరెడ్డి, సుద్దాల నరసింగం, రాజేశ్వరరావు, రాంసింగ్, రాజ్ తిలక్, సుధాకర్, రాజేష్, నరేష్, ఈశ్వర్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని పద్మశాలి మండపంలో శనివారం శ్రీ పద్మావతి, శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు సందీప్, దాస్, విజయ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ.. స్వామి వద్దకు వెళ్లలేని భక్తుల కోసం స్థానికంగా కల్యాణం నిర్వహించనుండగా పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 3, పొలిటికల్ సైన్స్ 1, కంప్యూటర్ సైన్స్ 2, మొత్తం ఆరు పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి బోధనలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను శుక్రవారం నాటికి కళాశాలల్లో అందించాలని, శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న రాజనీతి శాస్త్రంలో ఒక పోస్టు, తెలుగులో ఒక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హవీలా ఒక ప్రకటనలో తెలిపారు. 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలని, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు శనివారం ఒరిజినల్ సరిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

జూలూరుపాడు: రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినట్లు తహసీల్దార్ శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తగా మంజూరైన చీపురుగూడెం, పడమట నర్సాపురం-2, జూలూరుపాడు-2, కాకర్ల-2, వినోభానగర్ రేషన్ దుకాణాల ఏర్పాటుకు అర్హులైన ఎస్టీ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

పీవీకే-5 షాఫ్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5షాఫ్ట్ గని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు గురువారం గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ సమక్షాన జరిగిన మైన్స్ కమిటీ సమావేశంలో టీబీజీకేఎస్ నాయకుడు కూసన వీరభద్రయ్య పలు సమస్యలను వివరించారు. మ్యాన్ రైడింగ్ లేకపోవడం, బురద తొలగింపు, వెంటిలేషన్ తదితర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. నాయకులు, అధికారులు సీహెచ్.శ్రీనివాస్, కిషోర్, సతీష్, ఈశ్వరయ్య, రాజయ్య, అజయ్, మోహన్, కృష్ణ, సాయి, రాకేష్, రామ్మోహన్‌రావు, సమీర్, శ్రీనివాస్, లక్ష్మయ్య, సక్రు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

ఇల్లెందురూరల్: ఈనెల 25న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ బి.చెంచురత్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. 2020 నుంచి 2023 వరకు విద్యాసంవత్సరాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ), బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఐటీఐ, డిప్లమా ఉత్తీర్ణులైన నిరుద్యోగులు తమ బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

సిమెంట్ లారీ బోల్తా

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ శివారులో గురువారం సిమెంట్ లోడ్ లారీ బోల్తాపడింది. లారీ ఆళ్లపల్లి నుంచి భద్రాచలం వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ భిక్షమయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ నుంచి బయటపడ్డ సిమెంట్ బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కొమరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పల్లెలకు సీసీ సొబగులు

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ స్థానిక సంస్థలకు వరాలు
- ప్రతీ పల్లెలోనూ నిర్మాణానికి కసరత్తు
- ఒకేసారి నిర్మాణంతో అధికారులకు భారంగా మారిన పర్యవేక్షణ



సీసీ వేసేందుకు సిద్ధంగా ఉన్న రోడ్డు



సీఎస్పీ బస్తీలో ఎత్తుగా పోసి, సైడ్‌బరమ్ పోయకుండా వదిలేసిన రోడ్డు

ఇల్లెందురూరల్: ఒకప్పుడు పల్లెల్లో అంతర్గత రహదారులను మొరంతో మెరుగుపర్చేవారు. కాలానుగుణంగా సీసీరోడ్లు వచ్చి చేరాయి. దీంతో ప్రజాప్రతినిధులు పల్లెల్లో ఇతర పనుల కంటే సీసీ రోడ్లు వేయడంపైనే మక్కువ చూపుతున్నారు. ఇతర మండలాలతో పాటే ఇల్లెందు మండలంలోనూ గడిచిన ఆరు నెలలుగా వివిధ పథకాల పేరిట మంజూరవుతున్న నిధులన్నింటినీ సీసీ రహదారులకే వెచ్చిస్తున్నారు. దీంతో మండలంలోని పల్లెల అంతర్గత రహదారులన్నీ కాంక్రీట్ సొబగులు అద్దుకుంటూ ముస్తాబవుతున్నాయి.

అభివృద్ధి కనిపించేలా...

ప్రస్తుతం అసెంబ్లీ, పంచాయతీ ప్రజాప్రతినిధుల పదవీకాలం చివరి దశకు చేరుతుండడంతో నేతలు ప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయించుకుంటున్నారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సైతం ఇల్లెందు మండలానికి గడిచిన ఆరు నెలల వ్యవధిలో రూ.కోట్లలో నిధులు మంజూరు చేయించారు. ఆరు నెలల క్రితం ఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.2 కోట్లు, నాలుగు నెలల క్రితం డీఎంఎఫ్ పథకంలో భాగంగా రూ.4.5 కోట్లు, తాజాగా డీఎంఎఫ్ పథకంలో భాగంగా మరో రూ.4 కోట్లు, ఎస్‌డీఎఫ్ పథకంలో భాగంగా రూ.2.90 కోట్లు నిధులు కలిపి 11.40 కోట్లు మంజూరయ్యాయి. ఇంతేకాకుండా మరో రూ.3 కోట్ల నిధుల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నిధులతో ప్రతీ పల్లెలోనూ సీసీ రహదారుల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టేలా కసరత్తు చేస్తున్నారు.

230 సీసీ రోడ్ల నిర్మాణం..

ఇల్లెందు మండలానికి మంజూరైన రూ.11.40 కోట్ల నిధులతో 238 సీసీ రహదారులు వేయాల్సి ఉంది. అయితే, కేవలం రూ.2.30 కోట్ల వ్యయంతో 55 రోడ్లు మాత్రమే పూర్తి చేశారు. ఎస్‌డీఎఫ్ పథకం ద్వారా మండలంలోని 29 పంచాయతీలలో 58 పనులకు గాను 2.90 కోట్లు మంజూరవగా 48 పనులకు రూ.1.77 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఐదు జీపీల నిధులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇక విడుదలైన నిధుల్లో ఇప్పటివరకు 1.30 కోట్లు వెచ్చించి 35 రోడ్లు నిర్మించారు. డీఎంఎఫ్ పథకంలో భాగంగా మంజూరైన రూ.4.50 కోట్ల వ్యయంలో రూ.కోటి నిధులతో కేవలం 20 రోడ్లు మాత్రమే వేశారు. మిగతావి ప్రారంభం కాలేదు.

ఎడతెగని జాప్యం..

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతీ పల్లెకు సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. సకాలంలో పనులు జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంజూరైన నిధులను సకాలంలో వినియోగించుకోకుంటే వెనక్కు వెళ్తాయనే ఆందోళన నెలకొంది. కాగా, పనుల కోసం పోటీ పడుతున్న కాంట్రాక్టర్లు పనులపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సమస్యాత్మకంగా పర్యవేక్షణ..

మండలంలో మంజూరైన పనులన్నింటినీ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇల్లెందు ఏఈగా విధులు నిర్వహిస్తున్న అధికారే టేకులపల్లి మండలంలోనూ అదనపు బాధ్యతల్లో ఉన్నారు. దీంతో రెండు మండలాల్లో పర్యవేక్షణ భారంగా మారిందనే చెప్పాలి. దీంతో కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా చేపట్టడంపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. సీసీ రోడ్లకు సైడ్‌బరమ్ కూడా వేయకపోవడంతో ప్రమాదానికి నిలయాలుగా మారే అవకాశం లేకపోలేదు.

త్వరగా పూర్తయ్యేలా చూస్తాం



మండలంలో పలు పథకాల పేరిట మంజూరైన నిధులతో రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కొంత జాప్యం జరుగుతోంది. పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా నిరంతరం పర్యవేక్షిస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షం..

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం చుంచుపల్లి మండలం ప్రశాంత్ నగర్ రైతువేదికలో ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రైతులతో కలిసి రైతుసమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత విద్యుత్ పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వెనకు తీసుకోవాలని, బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఈ సమావేశంలో వనమా రాఘవేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీటీసీ భుక్యా రుక్మిణి, కో- ఆప్షన్ సభ్యులు ఆరిఫ్ ఖాన్, సర్పంచులు మోతీ, పోడియం సుజాత, తాటి పద్మ, రతన్ నాయక్, భాస్కర్, శ్రీకాంత్, రాజేష్, అచ్చ నరేందర్, హమీద్, రాసేపల్లి ప్రసాద్, కుమారస్వామి, బాదావత్ శ్రీకాంత్, కార్యకర్తలు, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ నిధులతో లైబ్రరీ భవనం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ లచ్చతండాలో నిర్మించిన లైబ్రరీలో పుస్తకాలకు సీఎస్ఆర్ నుంచి విడుదల అయిన రూ.2 లక్షల చెక్కుని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ లచ్చతండా సింగ్యతండా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామస్తుల వినతి మేరకు ఐటీడీఏ నిధులతో లైబ్రరీ భవనం మంజూరు చేయించి నిర్మించడం జరిగిందని, పుస్తకాలకు సీఎస్ఆర్ నిధులు రెండు లక్షలు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు బోడ గన్నా నాయక్, శంకర్, నరేందర్, మంగీలాల్, మోతీలాల్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణిలో ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అందుకున్న, ఇల్లెందు ఏరియా నుంచి బదిలీ అయి వెళ్తున్న బీసీ ఉద్యోగులకు సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గురువారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా సత్కరించింది. మేనేజర్ పూర్ణచందర్, ఫిట్టర్ సాంబమూర్తి, డీవైపీఎం గుర్రం శ్రీహరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, కోట సాంబయ్య, ఎస్‌వీఎస్ రాజు, యాదగిరి, శివప్రసాద్, ఎస్.రంగనాథ్, సైదులు, రమేష్, వంశీకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. పార్టీ కమిటీలు పర్యటించి బాధితుల వివరాలు సేకరించి అధికారులకు సమాచారం అందించాలన్నారు.

వార్డుల్లో ఇళ్ల పరిశీలన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

ఇల్లెందు: జోరు వానలో పట్టణంలోని వార్డులలో వర్షానికి కూలే ప్రమాదం ఉన్న ఇళ్లను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ పరిశీలించారు. గురువారం కౌన్సిలర్లతో కలిసి పలు వార్డుల్లో పర్యటించారు. స్టేషన్ బస్తీ, సబ్‌జైలు బస్తీలలో పర్యటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాల్వలు, డ్రెయినేజీలను పరిశీలించారు. అత్యవసరం అయితే హెల్ప్‌లైన్ సెంటర్ 9059359694 సంప్రదించాలని సూచించారు.

ఆచరణకు నోచుకోని మహిళా హక్కులు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): భారత రాజ్యాంగంలో మహిళలకు అనేక హక్కులు కల్పించినప్పటికీ, అవి ఆచరణలో శూన్యమని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. గురువారం కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళపై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీలు, అభ్యుదయ భావాలు కలిగిన నాయకులు, దళిత సంఘాలు ఈ విషయంలో ఆందోళన కార్యక్రమా లు నిర్వహించి ఘటనను ఖండించాలన్నారు. ఈ సమావేశంలో మోరే రమేష్‌కుమార్, ఊట్లగణేష్, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న పాపారావు దొర

పాల్వంచ: ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నెహ్రూనగర్‌కు చెందిన శెట్టిపల్లి గోపాలకృష్ణ, అశ్వారావుపేట నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా పాల్వంచ కొత్తూరుకు చెందిన చెర్ప పాపారావు దొర నియామకమయ్యారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, జిల్లా పార్లమెంటరీ సభ్యులు నల్లమోతు తిరుమలరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు గురువారం వారు తెలిపారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

టేకులపల్లి: వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజల అవస్థలు పడాల్సి వస్తుందని తక్షణమే అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం మండల కార్యదర్శి తోటకూర సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫాగింగ్ చర్యలు చేపట్టాలని, వీధులను శుభ్రపరిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం మండల అధ్యక్షుడు భూక్య లక్ష్మణ్, నాయకులు భూక్య కిషన్, రామ, గవాస్కర్, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న రవి

జూలూరుపాడు: సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్ ఉద్యోగులుగా గుర్తించాలని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ యూనియన్ చండ్రుగొండ యూనిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్లూరి రవి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో చండ్రుగొండ యూనిట్ (జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి) ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. సూపరింటెండెంట్ కేడర్ గల వారిని గెజిటెడ్ ఉద్యోగులుగా మార్చాలన్నారు. ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు తక్షణమే చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి సర్వరాజ్ అలీ, ప్రసన్న, నితిన్, మీరా సాహెబ్, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేష్, అశ్వారావుపేట, ఇల్లందు యూనిట్ అధ్యక్షులు విద్యాధర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టుపై నిరసన

పాల్వంచ: హైద్రాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రఘునందన్ రావు, ఈటెల రాజేందర్‌లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బీమాల్‌జైన్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యారవినాయక్, సందీప్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై కేసు

ఇల్లెందు: మండలంలోని హనుమంతులపాడు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఇల్లు నిర్మిస్తుండగా ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ టి.కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలో నివాసం ఉంటున్న వినోత్ లాహోటీకి హనుమంతులపాడు వద్ద ఐదు ఎకరాల స్థలం ఉంది. ఆ స్థలంలో ఇల్లు నిర్మిస్తుండగా అదే గ్రామానికి చెందిన కృష్ణ, పూలమ్మ, మరో మహిళ ఆ నిర్మాణను అడ్డుకుని ధ్వంసం చేశారని వినోద్ లాహోటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దాడి ఘటనలో..

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం పంచాయతీ బొంబాయితండాకు చెందిన బాదావత్ మంగీలాల్‌ను అదే గ్రామానికి చెందిన అత్త భూక్య రాజీ, బావమరిది వినోద్ దాడిచేసి గాయపర్చారని బాధితుడి ఫిర్యాదు మేరకు కొమరారం పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలి

పాల్వంచ: బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. బీసీలకు రూ.లక్ష రుణ సాయం అంటు కేసీఆర్ కొత్త నాటకానికి తెరలేపారని, కానీ జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, అసెంబ్లీ మహిళా కన్వీనర్లు కేతిని కుమారి, కోలా మల్లికా, మార్గమ్మ, ఆశాలు, సరోజ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ కమిటీ సమావేశాన్ని అడ్డుకుంటాం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ఈనెల 21న జరిగే సేఫ్టీ కమిటీ సమావేశానికి టీబీజీకేఎస్‌తో పాటు అన్ని కార్మిక సంఘాలను పిలవాలని లేని పక్షంలో సమావేశం వద్ద ఆందోళన నిర్వహించటమే కాకుండా, అడ్డుకుంటామని జాతీయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో సీహెచ్‌పీ డీవైఎస్ఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు సంఘం కాల పరిమితి అయిపోయిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాల్సిన యాజమాన్యం, నిర్వహించనందున, కార్మిక సంఘాలను పిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, కుమారస్వామి, జే.గట్టయ్య , భిక్షపతి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా ఉండాలి

ఇల్లెందురూరల్: ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణవేణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలకు కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా చేర్పులు, మార్పులు, మృతులను గుర్తించి తొలగించడం వంటి అంశాలపై గురువారం అవగాహన నిర్వహించారు. ఎంపీఓ పిల్లి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు అవార్డుల ప్రదానం

చుంచుపల్లి: కొత్తగూడెం డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లకు డీఎం వెంకటేశ్వరరావు క్యాష్ అవార్డులు అందజేశారు. సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

పరామర్శ..

జూలూరుపాడు: మండలంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ గురువారం పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. చావా వెంకటరామారావు, సర్పంచ్ భూక్యా రాములు, సొసైటీ డైరెక్టర్ రెడ్డిబోయిన రాము నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కనకయ్య, రామారావు తదితరులు ఉన్నారు.

ఎడతెరపిలేని వాన..

నాలుగురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తోంది. ఈ మేరకు పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుని అలుగుపోస్తునాయి. పలు చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: రోడ్డుపై చెట్లను తొలగిస్తున్న పోలీసులు



ఇల్లెందు రూరల్: నిండుకుండలా మారిన మామిడిగూడెం పెద్దచెరువు



టేకులపల్లి: రోడ్డుపై నిలిచిన నీరు

ఎక్కడి చెత్త అక్కడే..

- కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్య పనులకు బ్రేక్
- వీధుల్లో కుప్పలుగా చెత్తాచెదారం
- నిండిపోతున్న డ్రెయినేజీలు



చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిన డ్రెయినేజీ



రోడ్డెక్కిన చెత్త



పందుల స్వైర విహారం..

ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా కనుమరుగైంది. కార్మికులు రోజువారీగా పనులు చేస్తేనే పల్లెల్లో స్వచ్ఛతకు నిలయంగా ఉండేవి. అలాంటిది ఏకంగా 15 రోజులపాటు కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఇంటింట చెత్త సేకరణ పనులు పూర్తిగా స్తంభించాయి. దీంతో ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్నారు. ఈ కారణంగా రహదారులపై ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. డ్రెయినేజీలు నిండి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుడటంతో పేరుకుపోతున్న చెత్త కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా కార్మికలు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా రోజువారీగా కూలీలను నియమించి పారిశుద్ధ్య పనులు చేయించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. కానీ పనికి వచ్చే కూలీలను పంచాయతీ కార్మికులు అడ్డుకోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇలాంటి పరిస్థితిలో పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.